క్లుప్తంగా

కొండపాటూరులో వివాదంపై సమగ్ర విచారణ: ఎస్ఐ

కాకుమాను: మండలంలోని కొండపాటూరులో రెండు సామాజిక వర్గాల మధ్య నెలకొన్న స్థల వివాదంలో సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు బయటకు తీస్తామని ఎస్ఐ రవీంద్ర ఆదివారం తెలిపారు. గ్రామంలోని చెరువు విషయంలో రెండు వర్గాల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా విభేదాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం రెండు వర్గాలకు చెందిన వారు స్టేషన్‌కు పరిష్కారం కోసం వచ్చారని పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన బ్రహ్మాజీ అనే వ్యక్తి ఒక వర్గానికి చెందిన మహిళపై దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదివారం బ్రహ్మాజీ కూడా తాను మహిళపై దాడి చేయలేదని, అసలు ఆ సమయంలో గ్రామంలో లేనని, తప్పుడు కేసు పెట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కనుల పండువగా దశావతార కల్యాణ మహోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతార కల్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాల్ని నిర్వహించారు. స్వామికి పరశురామ అవతారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గుంటూరు రూరల్: యనమదల జెడ్పీ హైస్కూలులో ఆదివారం 1990–91 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 34 సంవత్సరాల తరువాత కలుసుకున్న ఆనందంలో ఉత్సాహంగా, సందడిగా గడిపారు. ఆనాటి మధుర స్మృతుల్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థి, జ్యోతిషుడు నాగలింగచందు బసవేశ్వరశాస్త్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శివయ్య సన్నిధిలో భక్తిశ్రద్ధలతో హోమాలు, యాగాలు



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహా లక్ష్మీ గణపతి మహా యాగం క్రతువును వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. విష్ణుభట్ల ఆంజనేయ చయనుల ఆధ్వర్యంలో ఆరు రోజుల మహా యాగం, హోమాలు ఆదివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి చండీ, రుద్ర, నవగ్రహ హోమాలు, శ్రీ చక్రార్చన, వేదపారాయణలు, బాల, సువాసినీ పూజలు, జపాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి హోమాలు, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు చండీ హోమ పూజల్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు ఎస్. శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు స్పందన



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో ఈ నెల 28 నుంచి 97వ శ్రీ రామకోటి మహోత్సవాల్ని పురస్కరించుకుని ఆదివారం చిన్నారులకు శతక కంఠస్థం, చిత్రలేఖనం, భక్తి పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు 29వ తేదీ బహుమతి ప్రదానం ఉంటుందని శ్రీ రామనామక్షేత్రం ట్రస్టీస్ రాగం వెంకట లీలా సుందరి, మస్తాన్‌రావు దంపతులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ట్రిపుల్ ఎక్స్ అధినేత మాణిక్యవేల్, పాలక మండలి సభ్యులు కె.వి.సుబ్బారావు, పబ్బిశెట్టి రామకృష్ణ, డాక్టర్ బి. రాఘవరావు, బి. వరలక్ష్మి, బసవరాజు, జయశంకర్, బండి రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో పేదలకు ధీమా

- 30 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాల్లో సొమ్ము
- గుంటూరు జిలాకు నెలలో రూ.1.55 కోట్ల మంజూరు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు కఠారి నిర్మల. స్వగ్రామం లాం శివారు తాటిరెడ్డిపాలెం. భర్త కఠారి అశోక్ సెంట్రింగ్ పని చేసేవాడు. పనికి వెళ్లి కాలు జారి 4వ అంతస్తు నుంచి కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కోసం వలంటీర్ క్లైయిమ్ రిజిస్ట్రేషన్ చేశారు. తక్షణమే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు చెల్లించారు. మిగిలిన బీమా సొమ్ము కోసం అవసరమైన పత్రాలను ఇన్సూరెన్స్ కంపెనీకి అప్లోడ్ చేయించారు. 30 రోజుల్లో ఈమె బ్యాంకు ఖాతాలో రూ.4.90 లక్షలు జమ అయ్యాయి. డబ్బులతో కొంత పొలం కొని పిల్లల పేరు మీద పెట్టుకున్నట్లు నిర్మల వివరించింది.

నెహ్రూనగర్: వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తోంది. ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు ఆసరాగా నిలుస్తోంది. బాధితులకు సకాలంలో సొమ్ము అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో చెల్లింపు చేస్తున్నారు. పేద ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.

బాధితులకు 30 రోజుల్లో..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వైఎస్సార్ బీమాలో నమోదైయిన 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వారు ప్రమాదవశాత్తూ మరణించినట్లయితే ఆ పాలసీదారుడికి సంబంధించిన వివరాలు గ్రామ/వార్డు సచివాలయంలో క్లైయిమ్ రిజిస్ట్రేషన్ చేసి వారికి మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ.10 వేలు చెల్లిస్తున్నారు. అనంతరం 12 రోజుల్లో పోలీసుల నుంచి క్లైయిమ్ డ్యాకుమెంట్స్‌ను ఇన్సూరెన్ కంపెనీకి అప్లోడ్ చేసిన కొద్ది రోజుల్లోనే బీమా క్లైయిమ్ అవుతుంది. 2023–24 సంవత్సరానికి ప్రమాదవశాత్తు మరణించిన వారు 50 మంది క్లైయిమ్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 48 క్లైయిమ్స్ అప్లోడ్ చేయగా 31 మందికి ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.1.55 కోట్లు 30 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాల్లో బీమా సొమ్ములు జమ అయ్యాయి.



క్లైయిమ్స్‌లో జాప్యం లేదు..

ప్రమాదవశాత్తూ మరణించిన వ్యక్తుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నాం. చనిపోయిన తరువాత మట్టి ఖర్చులకు రూ.10 వేలు, అదే విధంగా 30 రోజుల్లో నేరుగా నామినీ బ్యాంకు ఖాతాలో రూ.4.90 లక్షలు జమ చేయిస్తున్నాం. ఎక్కడా ఈ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నాం.

–వై.హరిహరనాథ్, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ప్రధానం

నారీ శక్తి సమ్మేళనంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి

గుంటూరు మెడికల్/ గుంటూరు రూరల్ : దేశవ్యాప్తంగా మహిళ సమన్వయ్ ఢిల్లీ సంస్థ ఆధ్వర్యంలో 400 ప్రదేశాల్లో ఆదివారం నారీ శక్తి సమ్మేళనం నిర్వహించారు. అందులో భాగంగా గుంటూరు లాల్‌పురం రోడ్డులోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమానికి జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ మహిళల సుగుణాలు సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. నారీ శక్తి స్టేట్ కో–ఆర్డినేటర్ సాధినేని యామిని శర్మ మహిళా సమాజ నిర్మాణం కోసం, పర్యావరణ పరిరక్షణ, దేవాలయాల పునరుద్ధరణ, సంస్కారవంతంగా పిల్లలని పెంచడం తదితర విషయాలపై మాట్లాడారు. ప్రతి మహిళా సమాజానికి కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ రోడ్డు సెఫ్టీ ఆవశ్యకత, సమాజంలో మహిళల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ ట్యాక్స్ సీనియర్ అకౌంట్ ఆఫీసర్ కల్పన, న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ, నారీ శక్తి కన్వీనర్ విజయలక్ష్మి, సహ కన్వీనర్ గీత, సామాజిక కార్యకర్త ముదిగొండ సుష్మ, ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణప్రశాంతి, ప్రముఖ న్యాయవాది విజయభారతి, స్వాగత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమిషనర్ నాగజ్యోతి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పార్టీలో విద్యావేత్త ముత్యంకు సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్

నగరంపాలెం: విద్యావేత్త, ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పి. ముత్యంకు పార్టీలో సముచిత స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన ఆయన్ను ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ ఏఈఎల్‌సీ విద్యా సంస్థల్లో ముత్యం చాన్నాళ్లు పని చేశారని తెలిపారు. ఆయన వద్ద చదువుక్కు వారు నేడు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నా రు. పల్నాడు ప్రాంతంలోనూ సాంస్కృత, సాహి త్య, సేవా కార్యక్రమాలను నిర్వహించారని గుర్తు చేశారు. సమాజ, ప్రజా సంబంధాలు కలిగిన వ్యక్తి ముత్యం అని తెలిపారు. లెక్చరర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాది రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పిస్తారని, అందుకు ముత్యం నిదర్శనమని చెప్పారు. సన్మాన గ్రహీత ముత్యం మాట్లాడుతూ పదవి కేటాయింపుతో బాధ్యతలు పెరిగాయని, వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ముత్యంను సన్మానిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం పెన్షనర్స్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ సీనియర్ పెన్షనర్ సభ్యులైన విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ సి.శేషగిరిరావు, విశ్రాంత ఎంఈవో ఎస్.గోపాల కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, తెలుగు పండితులు రాజన్న మాస్టర్ మాట్లాడుతూ పింఛన్‌దారుల ప్రశాంత జీవనానికి ఎనలేని కృషి చేసిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు డి.ఎస్.నకారా, అప్పటి భారత 16వ ప్రధాన న్యాయమూర్తి వై.వి చంద్రచూడ్‌కు పెన్షనర్లు జీవితాంతం రుణ పడి ఉంటారని తెలిపారు. విశ్రాంత ఇంజనీర్ సదాశివం మాట్లాడుతూ 1922 జనవరి 1 నుంచి దేశంలో అమల్లోకి వచ్చిన ఫండమెంటల్ రూల్స్‌లో పెన్షన్‌ను ఒక హక్కుగా పొందుపరచలేదన్నారు. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారులుగా ఉండి 1972లో రిటైర్డ్ అయిన డి.ఎస్. నకారా పెన్షనర్ల అనేక సమస్యలపైన పిటిషన్ వేసి సుదీర్ఘకాలం పోరాడి, అనుకూలంగా చారిత్రాత్మకమైన తీర్పుని సాధించారని గుర్తు చేశారు.



సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు

జస్టిస్ రోహిణి కమిటీ రిపోర్టు బహిర్గతం చేయాలి

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన జస్టిస్ రోహిణి కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ కార్యాలయంలో ఆదివారం బీసీ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు దుర్గారావు అధ్యక్షతన బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బీసీల అంశంలో అన్ని రాజకీయ పార్టీలు దాటవేత ధోరణి కనపరుస్తున్నాయని తెలిపారు. చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి నాయకులు శరబలింగం విజయలక్ష్మి, వేణు, బుజ్జమ్మ, ప్రేమ్‌రాజ్, తాడికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

గుంటూరు పార్లమెంట్ సీటు ఓబీసీలకు కేటాయించాలి

గుంటూరు పార్లమెంటు సీటును ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని అఖిల భారత ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ కోరారు. బ్రాడీపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వర్గాల్లోని 139 కులాల్లో 61 కులాలు గుంటూరు పార్లమెంట్ పరిధిలో మెజార్టీ ఓటర్లుగా ఉన్న నేపథ్యంలో వారికే పార్లమెంటు సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ సచివాలయాల్లోనూ మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని తెలిపారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై ప్రజలు నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక గుర్తింపు



పెదకాకాని: వైఎస్సార్ సీపీ కోసం కష్టపడిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి తెలిపారు. పెదకాకానికి చెందిన బండ్లమూడి భాను కిరణ్‌ను రాష్ట్ర విద్యార్థి విభాగం అధికారి ప్రతినిధిగా పార్టీ ఈనెల 14న ప్రకటించింది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి లూథర్‌గిరి కాలనీలో భాను కిరణ్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. భాను కిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ విజయంలో శక్తివంచనలేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, పంచాయతీ మెంబరు పిల్లి రత్న కుమారి, మండల కో– ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, నాయకులు గోళ్ల శ్యాంముఖర్జీబాబు, పల్లె నరేష్ పాల్గొన్నారు. అనంతరం పార్టీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

వృద్ధులు, దివ్యాంగులకు కిట్ల పంపిణీ

నగరంపాలెం: ఆదరణ కరువైన వయో వృద్ధులు, దివ్యాంగుల్ని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. నెలవారి కార్యక్రమంలో భాగంగా కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండలి కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రార్థన చేస్తున్న దైవాశీర్వాదం, క్రిష్టఫర్

పాత గుంటూరు: కొత్తపేటలోని కుగ్లర్ హాస్పిటల్ ఆవరణలోని ట్రినిటీ లూథరన్ చర్చిలో ఆదివారం సండే స్కూల్ క్రిస్మస్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు క్రిస్మస్ వాక్యాలు చదివారు. పాటలు ఆలపించి దేవుని మహిమ తెలియ పరిచారు. నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. ఫాదర్ చిన్నయ్య ఆత్మీయ సందేశం ఇచ్చారు. సంఘ కాపరులు రెవరెండ్ జె. దైవాశీర్వాదం, వి. క్రిష్టఫర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి చిన్నారుల్ని ఆశీర్వదించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బి. గ్రేస్ సుదర్శన్, కోశాధికారి బత్తుల లెనిన్, టి. రాజేష్, బి. విల్సన్ పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలే పేదరిక నిర్మూలనా మార్గాలు



వెంకటకృష్ణాపురంలో ఉచిత దంత వైద్య శిబిరానికి వచ్చిన వారితో అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- అగతవరప్పాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

పెదకాకాని: ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించిన ఏకైక ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడులో ఆదివారం ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని స్థానిక పెద్దలతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనం కలలను, తన ఆశయాలుగా స్వీకరించి, రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమమైన ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించడమే కాకుండా నూటికి నూరు శాతం అమలు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకాన్ని కలిగించి దళారీల అవసరం లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందిస్తూ జనం గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలన ప్రశంసనీయమన్నారు. అందుకే ఒక ఏడాదిని ఆయన పేరుతో ప్రకటించడమే కాకుండా ఏడాది పొడవునా సంక్షేమ కార్యక్రమాల పరంపరగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంగా రూపుదిద్దుకుందన్నారు. నేత్ర జ్యోతి కార్యక్రమం ద్వారా కంటి సమస్యలతో బాధపడే వారికి ఊరట కల్పించి వారి భవితవ్యాన్ని వెలుగులతో నింపడం జరుగుతుందన్నారు. గత 11 నెలల్లో 14,448 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేయించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశామన్నారు. ఈ వైద్య పరీక్షల ద్వారా నిపుణులైన డాక్టర్లను నాణ్యమైన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి, పరీక్షలు జరిపి ఏడు రోజుల్లో అక్కడే కళ్లజోళ్లు పంపిణీ చేయడం నేత్రజ్యోతి ప్రత్యేకతగా పేర్కొన్నారు. నేత్రజ్యోతి వైద్య శిబిరం నిర్వహించడానికి రెండు రోజులు ముందుగానే అగతవరప్పాడు పరిసర ప్రాంతాల్లో బజరంగ్ సేవా విభాగం బృందం పర్యటించి ఇంటింటికీ ప్రచారం చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 454 మందికి దగ్గర ఉండి వైద్య పరీక్షలు చేయించినట్లు చెప్పారు. ఇదే శిబిరంలో గుంటూరు ట్రికాన్ క్లినిక్ వారి సహకారంతో గ్రామంలో 76 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించామని అంబటి మురళీకృష్ణ వివరించారు. స్థానిక స్కూల్ విద్యార్థులకు కూడా ప్రత్యేక సమయాన్ని కేటాయించి కంటి పరీక్షలు జరిపించారు. వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేక వాహనాల ద్వారా వైద్య శిబిరానికి తీసుకువచ్చి వైద్య పరీక్షల అనంతరం తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు కూడా వాహనంలో తీసుకు వెళ్లడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చరిత్రను విస్మరిస్తే జాతుల మనుగడ ప్రశ్నార్థకమే

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వర్తమాన, భావితరాలకు తమ గత చరిత్రల్ని అధ్యయనం చేసే అవకాశం పాలకులు కల్పించకపోతే ఆ జాతుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలెక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖరరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం గుంటూరు జిల్లా చరిత్ర సంఘ 29వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. చరిత్ర కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న సోమశేఖరరావు మాట్లాడారు. గతంలోని దుర్మార్గాలు, మంచి చెడుల్ని తెలియజేస్తూ భవిష్యత్ తరాల్ని నాగరిక జీవన విధానానికి తీసుకు వెళ్లేది చరిత్ర మాత్రమేనని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా చరిత్ర సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకువచ్చి అమలు చేయడం ఒక్కటే మార్గమని తెలిపారు. అందుకు భారతదేశం చొరవ చూపాలని కోరారు. అనంతరం కేఎల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ బుడ్డిగ జమీందార్ వ్యాసాల సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంతెన వెంకటరాజు స్మారకోపన్యాసాన్ని వై.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన 'విద్యా వ్యవస్థలో చరిత్ర– మార్పులు, వ్యాఖ్యానాలు' అంశంపై చరిత్ర సమీక్షకులు కొప్పర్తి వెంకటరమణమూర్తి మాట్లాడారు. 'భారత రాజ్యాంగం–లౌకికవాదం' అంశంపై సయ్యద్ అమీర్ అధ్యక్షతన ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అంజిరెడ్డి ఉపన్యసించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు, సి.ఎస్.ఆర్. ప్రసాద్, పలువురు చరిత్ర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, చరిత్ర అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమశేఖరరావు

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు, నిత్యావసరాల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పెన్షన్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ బిల్డర్ కొత్తమాసు ఏకానంద్ మాట్లాడుతూ పేదలకు అవోపా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నరసరావుపేట అవోపా అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవోపా ద్వారా ప్రతి నెలా 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్, రూ.వెయ్యి విలువగల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడాన్ని ప్రశంసించారు. ప్రముఖ మందుల వ్యాపారి వేలూ రి నరసింహారావు మాట్లాడుతూ ప్రతీ నెలా ఉచితంగా మందులు అందజేస్తానని తెలిపారు. తొలుత ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కోట సురేష్‌కుమార్ 'వృద్ధాప్యం శాపం కాదు వరం' అనే అంశంపై మాట్లాడారు. వృద్ధులకు సలహాల్ని అందించారు. అనంతరం డాక్టర్ రామలింగేశ్వరరావు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా నగర అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెన్షన్లు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న అవోపా ప్రతినిధులు

అలరించిన చిన్నారుల జానపద నృత్యాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కారభారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో భారత మాత పూజా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చిన్నారులు జానపద పోటీల్లో నృత్యాల్ని ప్రదర్శించి ఆహుతుల్ని అలరించారు. అనంతరం జూనియర్స్‌కు వ్యాసరచన పోటీలు, సీనియర్స్‌కు జీ–20 సదస్సుపై పోటీలు, మహాభారతంలోని అరణ్య వాసంపై అవగాహన పరీక్షలు జరిగాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు విద్యార్థులకు చక్కటి సందేశాల్ని అందించారు.